# డబ్బు జబ్బు

'అర్థమనర్థం, భావమనిత్యం, నాస్తి సుఖః తత లేశ సత్యమ్, అన్న శంకరాచార్యుల వారికి సరైన వివేకం లేదేమోననిపిస్తుంటుంది నాకు. వివేకమున్నవాళ్ళెవరూ ఆ మాటనరు ధనరాజుగారా మాట అసలు వొప్పుకోరు. ధనరాజుగారికా పేరు చిన్నతనాన తల్లిదండ్రులెట్లా పెట్టారో కాని ఆ పేరు నాయన సార్థకం చేశారు.

అయితే నాకు చాలా విచిత్రంగొలిపే విషయం ఏమిటంటే, అయనగారి అర్థోపార్జనావ్యామోహానికి అంతూ, దరీ అంటూ లేకపోవటమే. ఆయనగారు మెట్రిక్యులేషన్ పాసయినారో లేదో, మరి ఆ రోజుల్లో ఆ ఉద్యోగం ఎట్లా సంపాదించారో ఆ లీలామానుష విగ్రహుడికే ఎరుక. రోడ్డు రవాణా సంస్థలో ఇప్పుడాయన పర్చేజ్ ఆఫీసర్. సూటు - బూటు వేస్తాడు. కారు కూడా కొన్నాడిటీవల. కారు వేసుకుని వీధిలో పోతుంటే. ఎరిగిన, ఎరగనివారు కూడా ఆయనగారిని ఆరాధనాభావంతో చూస్తారు.

ఆయన చిరునవ్వులను దండగా గుచ్చి మెళ్ళో వేసుకుని మురిసిపోతారు. ఓ వేయి గజాల మేరకు నగరంలో అతిముఖ్యమైన ప్రదేశంలో రెండంతస్థుల చతురస్రం వొకటి కట్టించాడీయన, వెనుకటి మహారాజులు కోట కట్టించినట్లు. ఆ చతురస్రం లోపలి ఖాళీస్థలంలో ఎజ్బెస్టాస్ రేకులతో చౌకరకం వసతిగృహాలు కట్టించాడు. వసతి ఏమాత్రం వుండదు. అది వేరే విషయం. కేంద్రప్రభుత్వంవారు గృహనిర్మాణ శాఖలో మంత్రి పదవి ఇవ్వవలసిన వ్యక్తి ఈయన.

ఇంత చౌకగా ఇళ్ళు కట్టించగల నేర్పు అనితర సాధ్యమనే చెప్పాలి. అధికాహారోత్పత్తిశాఖవాళ్ళు నేలను వృధాగా వుంచక, ఏదో పాదో, మొక్కో నాటమని ప్రచారం చేస్తున్నట్లుగా, గజం నేలలో వో రూము కట్టించవచ్చుననేదే ఆయన నినాదం. నగరంలో ఇళ్ళంత కన్నా ఏం బావుంటాయి ? అన్నది సవాలు. మధ్య తరగతి చిన్న ఉద్యోగులూ, అంతకన్నా అడుగువాళ్ళూ పెద్దపెద్ద అద్దె లివ్వలేరనే ఉపకార బుద్ధితోనే ఆయన ఆ ఇళ్ళూ కట్టించాడు. ముందు వరసలోనూ, తక్కిన మూడు వైపులా అత్యంతాధునికమైన పద్ధతుల్లో హోటళ్ళు, బట్టలకొట్లూ, కిరాణాదుకాణాలూ, బార్బర్ షాప్స్, ఎలక్ట్రిక్ డ్రైక్లీనర్స్. మిఠాయి కొట్లు, మందులషాపులు, ఒక గొప్ప బేంక్ యొక్క బ్రాంచి ఆఫీసు— ఇది యదీ యననేల సమస్తమూ పురజనుల సౌకర్యార్థం ఆయన ఏర్పాటు చేశారు. ఒక్కొక్కటి ఎంతెంత అద్దెకిచ్చాడు అన్నది అప్రస్తుతం; అనవసరం. ప్రజలకోసం కాకపోతేనూ, ఆయన గొప్ప ఉపకార బుద్ధి కాకపోతేనూ రెండంతస్తులు ఎందుకు కడతాడూ ? అదిన్నీ కాక రెండు గదులు వేయవలసిన చోట మూడు గదులెందుకు వేస్తాడు ? చిన్న వాళ్ళకూ చిన్న చిన్న భాగాలు కట్టించి సేవచేసినవాడైనాడు, వీరూ వారని లేకుండా రెండంతస్తుల మేడ వరుసల్లో సమస్తసదుపాయాలూ సమకూర్చి పెట్టాడు.

ఇటీవలనే వెండి, బంగారం, గ్యారంటీ వస్తువుల దుకాణం కూడా తెరిపిం చిన్నారండీ! ఆయన షష్ఠిపూర్తి ఎంత వైభవంగా జరిగేనో! ఆయనకు సన్మానాలు చేసుకోవాలనుంటే! ఎందరు ప్రొఫెసర్లూ, మహాకవులూ పద్యాలు చద వాలో! ఎంతకాలమూ రాజకీయ నాయకులకు, అదీన్నీ ప్రభుత్వ నేతలకు మాత్రమే గౌరవపట్టాలనిచ్చి సత్కరించటం ఏం బాగుంది? ధనరాజుగారు ప్రజాసేవలో ఏతాదృశులకు ఏమాత్రమున్నూ తీసిపోరు కదా!

ధనరాజుగారి గొప్పతనము కర్ణాకర్ణిగా వినటమే కాని, ప్రత్యక్షంగా ఎప్పుడూ వారిని దర్శించి, వారి మహత్తును వేరీజు వేయటం జరగలేదు. గిట్టని వాళ్ళు వంద చెబుతారు. ఓపికను బట్టీ, అభినివేశాన్ని బట్టీ లక్షయినా చెప్పవచ్చును. వారి గొప్పతనం ప్రత్యక్షంగా ఎట్లా తెలిసిందంటే!

ధనరాజుగారి నాలుగు వరసల, రెండంతస్తుల భవనానికి మధ్యగల ఖాళీ ప్రదేశంలో, ప్రజా సౌకర్యార్థం కట్టించిన ఇళ్ళలో పడగయ్య అని ఓ బక్క జీవి వున్నాడు. ఒకటిన్నర గదులను రెండుగా చేసుకుని. ఈ ఒకటిన్నర గదుల్లో ప్రస్తుతం వాళ్ళు ముగ్గురున్నారు. భార్యా-భర్తలూ, పెళ్ళికెదిగిన కూతురు.

పడగయ్య ఓరోజున ఏడుస్తూ వచ్చాడు నా దగ్గరకు. నేనేమో క్లాస్ త్రీ ఆఫీసర్‌లాంటివాణ్ణి మహానగరంలో. అయితే తెల్ల చొక్కా, తెల్లలాగూ వేస్తూవుంటాను యథాశక్తి. తనకొచ్చిన కష్టాన్ని నేను ఏ విధంగానైనా పరిష్కరించగలనేమోనని వెర్రిబాగులాడి ఆశ. పడగయ్యతో నాకు గల అనుబంధం ఆపాటిదే, అతడు ఆశపడేందుకు పడగయ్యది మా ఊరే. ఒక్క పది అవతారాలెత్తే శ్రీమహావిష్ణువు అంత పేరు ప్రఖ్యా తులు సంపాదించుకుంటే శతావతారాలెత్తినా పడగయ్య ఏమీ ప్రఖ్యాతి సంపాదించుకోలేకపోయాడు. అపఖ్యాతిమాత్రం బాగానే సంపాదించాడు.

అయితే పడగయ్యంటే నాకు ఇష్టమూ, సానుభూతి వుండటానికి కారణం లేకపోలేదు. ఒకరోజున పడగయ్య స్టేషన్ దగ్గర నాకు కనపడినప్పుడు చాలా సంతోషం కలిగింది. స్నేహితుణ్ణి రైలెక్కించటానికి వెళ్ళాను నేను. పడగయ్య పెళ్ళాన్ని మా ఊరు పంపించటానికే వచ్చాడట. పడగయ్యది మా వూరే. నేను స్కూల్లో చదువుకునేప్పుడు, స్కూలు గేటు ఎదురుగానే ఇంటర్వెల్ టైమ్‌లో ఇడ్లీ అమ్ముకునేవాడు. అప్పటికది ఎన్నో అవతారమో! నాకు అరువు పెట్టేవాడు. రెండురూపాయలు, మూడు రూపాయలైనా ఏమీ అనేవాడుకాదు. వాళ్ళు మావాళ్ళే. మరి ఆ అభిమానమేమో! మా నాన్నగారితో నా బాకీవిషయం ప్రస్తావించేవాడుకాదు. ఏ పాఠ్యపుస్తకం కొంటానికో అదను చిక్కినప్పుడు ఆ బాకీ చెల్లేసేవాణ్ణి. గొప్పగొప్ప సంపన్నులింట వంటచేయటం, సినిమాహాలు ముందు టీకొట్టు నడపటం, సోడాబండి నిర్వహించటం, మధ్యాహ్నం టిఫిన్లుచేసి తాలూకా ఆఫీసూ, ఇంకా ఆఫీసులూ తిరగటం, అతడి అవతారలీలల్లో కొన్నని చెప్పాలి. అప్పుడప్పుడు శవావతారం కూడా ఎత్తేవాడు.

చిన్నతనాన పిల్లలు పుట్టిపోతుంటే తల్లి సుబ్బారాయడికి మొక్కుకుని, [స్వామి] పాము పేరు పెట్టుకుందని పడగయ్యే చెప్పాడొకసారి నాకు. లోకం ఎంత విచిత్రమైంది. పడగయ్య అమితసాధువు. ధర్మయ్య, సత్తిరాజు అని పెట్టుకున్నవాళ్ళు ఎన్నో దారుణాలూ, అబద్ధాలూ సృష్టించే వాళ్ళున్నారు.

పడగయ్యకు ఒక కూతురూ, వో కొడుకూ వున్నారు. కొడుకు వున్న వూళ్లోనే వారాలు చేసుకొంటూ హైస్కూల్లో చదువుకుంటున్నాడు. ఈ సంవత్సరం స్కూలు ఫైనలుట. పిల్లకి పదహారోఏడొచ్చిందని చెప్పి నెత్తీనోరూ బాదుకున్నాడు. స్టేషనులో కనపడినప్పుడు.

ఓ పెద్ద ప్లీడరుగారింట్లో వంటచేయటానికి వచ్చాడుట-వంట చేస్తున్నాడుట. ఆయన బాగా డబ్బు సంపాదిస్తున్న మాట నిజమేకాని, వాళ్ళావిడ ధాష్టీకానికి బ్రతకటం కష్టమనీ, ఏదైనా చిన్న ఉద్యోగం చూపించి పెట్టమనీ కళ్ళనీళ్ళ పర్యంతమైనాడు పడగయ్య. సరే అవాల్టి కట్లా మళ్ళీ చాలారోజుల తర్వాత పడగయ్యను చూడటం, సంగతులు వినటం జరిగింది.

ఇంతకూ ఇప్పుడు పడగయ్య కంఠానికి చుట్టుకున్న పాములాంటి సమస్య ఏమిటంటే, ఊరికి ఉపకారంగా కట్టించిన నగరమధ్యంలోని, సదరు ధనరాజుగారి పావురాళ్ళ గూళ్ళలో, వో గూటిలో పడగయ్య నలభై రూపాయలద్దె ఇస్తూవుంటున్నాడుగా. రేపు వచ్చేనెల 22 వ తేదిన, శేషమణి వివాహం. శేషమణి పడగయ్య కూతురు. శాపవశాన గంధర్వలోకంనుండి జారిపడిన మణిమేఖల అని చెప్పాలి. వరుడికి రెండొందలు ఇస్తే చాలును. పిండిమర పెట్టుకుని బతుకుతున్నాడు. దానికి తోడు వో దర్జీమిషన్‌కొని మామగారిచ్చాడా చాలునని చెప్పాడట. అందుకే చచ్చీ చెడీ రెండొందలు జమచేస్తున్నాడు. ఈలోపున వో నెల అద్దె బాకీ పడ్డాడు ధనరాజుగారికి. దానికాయన పాపం సహించి వూరుకున్నాడట గూడా. మరి అసలు ఇబ్బంది ఎక్కడవచ్చిందయ్యా అంటే రాజుపేటలో స్కూలుఫైనల్ చదువుతున్న సుబ్బారాయుడు ముప్ఫైరూపాయలు పంపించాను నాన్నా, అందిందా అని వో కార్డు గిలికిపారేస్తే అది పడగయ్యకు చేరింది. అదీ ఎప్పుడు ? ఇరవై రోజుల తర్వాత. అది మూడో ఉత్తరమట. డబ్బందిందీ లేందీ వ్రాయరేం. రశీదు వచ్చిందనుకోండి. అదే ధైర్యం ! అనీ సుబ్బారాయుడు రాశాడు. పడగయ్యొచ్చి లబోదిబో మని మొత్తుకుంటూ చెప్పిన సారాంశం- ధనరాజుగారు తన సంతకం పెట్టి ముప్ఫైరూపాయలూ తీసుకున్నారట. పడగయ్య తనకిప్పవున్నాడని,

కాగితం గూడా రాసి చూపెట్టాడట పోస్టుమెన్‌కు. పడగయ్య పోస్టాఫీస్‌కి వెళ్ళి కనుక్కుంటే, పోస్టుమెన్ వణికిపోతూ, బాబ్బాబూ, అంతోటి పెద్దోరుకదా, నువ్విమ్మన్నావని చెపితే ఇచ్చాను. రిపోర్టు చేశావో నా ఉద్యోగం వూడి; నేనూ, నలుగురు పిల్లలూ, జోలె పట్టుకుని పోవాలి అని ఏడ్చాడట. రిపోర్టు ఇవ్వాలన్నా, తానెట్లా రాయాలో తెలీదు. కాస్త యీ పెళ్ళి అయిపోతే రెండు నెలల అద్దె వొకేసారి ఇస్తానని చెప్పి బతిమాలి, ఆ ముప్ఫైరూపాయలూ ధనరాజుగారు మళ్ళీ తనకిచ్చేట్లుగా సాయంచేసి పెట్టాలి నేను. 'హతోస్మి' అనుకున్నాను. ధనరాజుగారు ఏం చేస్తారు పాపం. ఈ దుర్మార్గుడు 20-వ తేదీ దాకా అద్దె ఎందుకివ్వక పోవాలి? పైన కూతురుపెళ్ళి చేస్తున్నాడు, తన ఇంట్లోనే. ఇక వీడిచ్చే దేంది? చచ్చేదేంది! అని ధనరాజుగారు ఆపని చేశారు. అందులో తప్పేముంది. పడగయ్య సంతకాన్ని ఫోర్జరీచేసి తీసుకున్నాడంటారా? మీదంతా చోద్యం. ఎన్ని ఫోర్జరీలు చేయకపోతే, అబద్ధాలాడకపోతే, వీడి కడుపూ వాడికడుపూ కొట్టకపోతే, ఎవరైనా ప్రజాసేవ చెయ్యగలరా- బద్మాష్ వెధవ, అద్దె ఇవ్వకుండా, కూతురి పెళ్ళికి చందా ఇవ్వమని వచ్చి, పెద్ద పెద్ద ఆఫీసర్లూ, వ్యాపారస్తులూ, కంట్రాక్టర్లు వచ్చి దర్శనం గాక తిరిగిపోయే తనదగ్గర ఏడవటం, ఒకరూపాయిస్తే చాలదని ఏడిచి, ఐదురూపాయలన్నా ఇవ్వమని మూర్ఖంచేయటం, డీసెన్సీనా? మర్యాదా రాస్కెల్‌ని ఇంటిలోంచి వెళ్ళగొట్టించాలసలు. సాటివాడని అంటే డబ్బులో, పరువులో, మర్యాదలోకాదు, కులం ఎక్కడో వొకచోట కలిసి ఏడిసిందిట. అందుకని దయతో ధనరాజుగారు వాటా అద్దెకిచ్చారు. లేకపోతే ఇచ్చేవాళ్ళేకాదు.

పోస్టు వెధవది, తప్పేకదా! పోష్టుమేష్టరు ధనరాజుగారిని చూస్తే పడుకుని దణ్ణంపెడతాడు. అటువంటప్పుడు వాడు, పడగయ్య తనకిమ్మని

చెప్పాడంటే ఇవ్వక ఏం చేస్తాడు. అంతటి గొప్పవాడు, బడా బాబు ముష్టి ముప్పై రూపాయల కోసం అబద్ధాలాడతాడా ? అదీ పోష్టువాడి వాదం. అసలు పడిగ్గాడి సంతకమే అది అంటే ఏం చేసేట్లు ? ఎవరి మీద కేసు పెడతాడు. పడగయ్యే సంతకం అసలు చోట పెట్టి, సాక్ష్యం దగ్గర తన సంతకము పెట్టారుట ధనరాజుగారు. పడగయ్య సంతకం తెలుగులోనే పెట్టారు. ఏలననగా, తన కూతురు పెళ్ళికి, అంతా ధర్మం చేయవలెనని విన్నపం వొకటి రాసుకుని, పెద్దల వద్దకూ, తెలిసినవాళ్ళంటే కాలేజీలకూ, ఆఫీసులకూ తిరగటానికి వో విన్నపం వ్రాసి ఆ విన్నపం కింద పదిమంది పెద్దలచేత పదీ, ఐదూ, చందాలు వేయించి, ఆ పట్టికనుతెచ్చి ధనరాజుగారికి చూపాడు పడగయ్య సంతకం తెలుగులోనే వుంది.

మనియార్డర్ ఫారం మీద్ది నా సంతకంకాదు, ధనరాజుగారిట్లా చేశారు- అని పడగయ్య ఎవరి దగ్గర పోయి చెప్పుకుంటాడు ? ఎవరు నమ్ముతారు ? ఎవరేమంటారు ?

ఫలాని సినిమాతార తన్ను ప్రేమించి పెళ్ళిచేసుకుంటానని చెప్పిందని పడగయ్యంటే. ఎంత నమ్ముతారో, ధనరాజుగారు తన ముష్టి ముప్పై రూపాయలను, తన సంతకం చేసి తీసుకున్నాడన్నా అంతే నమ్ముతారు.

ఇదంతా నా ముందు ఏడిస్తే నేనేం చెయ్యను ? నేను పోయి ధనరాజుగారితో ఇదిన్యాయం కాదని, హెచ్చరికతో చెప్పగలనా ? ప్లీడర్ గారేమన్నారన్నాను ?!

'నువ్వెట్లాగూ నెలకు అద్దె బకాయి పడేవున్నావు కదా - ఇంకా నువ్వే ఆయనకు పదిరూపాయలివ్వాలి ? ఇప్పుడేం చేస్తావు? బతిమాలుకో ఇస్తే తీసుకో-ఎవరూ నమ్మరు నీ మాటలు' అన్నారుట.

‘తన పేదతనమూ, కూతురి పెళ్ళి, చిక్కులూ, అన్నీ చెప్పి, ఏడిస్తే, మళ్ళీ ముఖం చూపితే, చెంబూ తప్పేలా బయట పడేస్తానన్నారుట’ ధనరాజుగారు.

నన్నోసారి చెప్పమంటాడు పడగయ్య. నా కసలే పెద్దవాళ్ళను చూస్తే వొణుకు. భయంతో చెమటలు కారతాయి.

‘ఓ రిపోర్టు ఇయ్యి పడగయ్యా, ప్లీడరుగారిచేత రాయించి, పోస్టు మేష్టార్ జనరల్‌కి పంపుదాం’ అని సలహా చెప్పాను.

గోమాతల కన్నుల తమ్ముల్లాంటి కన్నులతో ‘సరేలేండి’ దాని సంగతి తరువాత చూస్తాను. అమ్మాయి పెళ్ళి 22 న. తాము తప్పక దయచేయాలి ఏదో కొంత సాయంచేయాలి. ఊరికే వద్దు, అని కృష్ణ లీలాతరంగం వొకటి పాడాడు. నేను చచ్చినట్లు విని, లోలోపల శాపనార్థాలు పెడుతూ, రెండు రూపాయలిచ్చి పంపించాను, తాము తప్పక రావాలి–అంటూ పడగయ్య వెళ్ళిపోయాడు. పడగయ్య ఏదో కొద్ది సంగీత జ్ఞానం కూడా వున్నవాడు. మొత్తానికి ఏదో విధంగా జీవికను నెట్టుకొస్తున్నాడు.

ఇరవై రెండు సాయంకాలం. వెళ్ళాను. జంతర్‌మంతర్‌లాంటి సౌధాంతర్గత వసతిగృహంలో, ఒకటిన్నర గదులముందు, ఇద్దరు బాజాభజంత్రీలూ మామిడాకుల తోరణాలు, నాలుగు కుర్చీలూ, మూడు బెంచీలు వేసి పడగయ్య. కూతురు పెళ్ళిచేశేశాడు. సుబ్బారాయుడు రాలేదు. వాడికి పరీక్షలు. అదీకాక రానూపోనూ నలభై రూపాయల ఖర్చు, ఇద్దరే ఇద్దరు తోబుట్టువులు. అక్కాతమ్ముళ్ళు. నా కడుపు తరుక్కుపోయింది. సుబ్బారాయుడు ఎవరింట్లోనో, వారాల భోజనం చేస్తూ ఇవాళ అక్కపెళ్ళి అని తలుచుకుంటాడు. వాడు సాయంకాలంపూట వొక ప్లీడరుగారింట్లో

ఆయన ఇద్దరు పిల్లలకు ఓ గంటసేపు ఓనమాలు దిద్దబెట్టీ, ఎక్కాలు చెప్పీ, కాపీ పుస్తకాలు రాయించీ, ఐదురూపాయలు సంపాదిస్తాడు నెలకు. అందులో రెండూ, మూడూ మిగిల్చి, మొన్నీమధ్య ధనరాజు గారికి ధర్మంచేశాడు. రామ్ములగపండులా వుండేవాడు చిన్నప్పుడు. ఇవాళంతా వాడిమనసు ఎట్లా వుండేనో-

పెళ్ళితంతు కాస్తా ముగియగానే, పడగయ్య నలమహారాజులాగా, గాడి పొయ్యిమీద భాండాలు ఎక్కించి, అటూ ఇటూ హడావుడిగా తిరుగు తున్నాడు.

నన్నుచూసి చాలా సంతోషించాడు.

"శేషూ" అని పిలిచాను.

శేషు చాలా సిగ్గుపడిపోయింది. శేషు మూడు నాలుగేళ్ళ పిల్లగా, నాముందు తిరగటంనుంచే నేను ఎరుగుదును. నా మనస్సు చాలా ఆర్ద్రమై పోయింది.

పెళ్ళికొడుకు బాగానేవున్నాడు.

నాలో కలిగిన భావసంచలనాన్నీ, ఆర్ద్రభావాన్నీ నిగ్రహించుకో లేక వో ఐదురూపాయలు శేషు చేతిలో పెట్టాను. శేషు సంకోచించింది కాని ముఖంలో సంతోషం నేను కనిపెట్టకపోలేదు. ఆమె గొప్పింటి పిల్లా ?! బహుమానాలు రావటానికి. బహుశా పెళ్ళి చదివింపుల తతంగ మంటూ ఏమీ వుండివుండక పోవచ్చును అక్కడ.

పడగయ్య వగర్చుకుంటూ వచ్చాడు. నేనూ వెళ్ళిపోతున్నానని ఎవరో చెపితే తడిగుడ్డతో ముఖం తుడుచుకుని, నా రెండుచేతులూ పట్టు

వీడి జన్మకు ఇవాళ పడగయ్య పొందిన సంబరం, సంతోషం, సంతృప్తి అర్థమవుతవా? అలాంటి అనుభూతి ఎప్పుడైనా ధనరాజు పొందగలడా! ఏమిటి ఇతడి ప్రవృత్తి? ఇంత తాపత్రయం, లంపటం ఎందుకు పెంచుకుంటున్నాడు? అంటే, నాకనిపించింది.

డబ్బు సంపాదించటమనేది ఒక వ్యసనం. భయంకరమైన జబ్బు. చీట్లపేకలాడటం, తాగుడూ, వ్యభిచారంలాంటిదే యీ జబ్బున్నూ. మనిషికి ఎన్నెన్ని తీరులైన, ఎన్నెన్ని విధాలైన వ్యసనాలో వుంటాయి. అబద్ధాలు చెప్పటం, ఇతరులను చెడగొట్టి ఆనందించటం, ఊరక ఆత్మస్తుతి చేసుకోవటం, దొంగతనం చేయటం, జులాయిగా తిరగటం, అతి కాముకత్వం- ఇవన్నీ వ్యసనాలే. కొందరికి హత్యలు చెయ్యటం, గృహదహనాలు చెయ్యటం కూడా వ్యసనాలేనట. అప్పుడప్పుడు పత్రికల్లో చూస్తూవుంటాం.

ఏ విధంగానైనాసరే ఇంకా ఇంకా డబ్బు సంపాదించాలనుకోవటం ఒక వ్యసనం. ఈ వ్యసనంకల వాళ్ళలోనూ తారతమ్యాలున్నాయి. ఎట్లానైనా సరే వాళ్ళు డబ్బు సంపాదించలేకపోతే కిందుమీదైపోతారు. రావలసిన డబ్బు. లేక వస్తుందనుకొన్న డబ్బు రాకపోతే అవాళ వాళ్ళు దుఃఖంతో, అసంతృప్తితో చచ్చిపోతారు.

ఇంకా ఇంకా డబ్బు సంపాదించాలనే వ్యసనం, భయంకరమైన అతి మూత్ర వ్యాధిలాంటిది. రోజూ ఇన్సులిన్ ఇంజక్షన్ ఇవ్వకపోతే, ఆ వ్యాధి పీడితుడి పని గోవిందే! అట్లానే డబ్బు సంపాదించకపోతే, ఏ రోజు రావలసింది, ఏ పద్దుకింద రావలసింది రాకపోతే వాణ్ణి ఆ వ్యాధి నిలవ నివ్వదు. ఈ వ్యాధిగలవాళ్ళలో డాక్టర్లూ, ప్రొఫెసర్లూ, ప్రజాసేవ

కులూ, వ్యాపారస్థులూ, రాజకీయ నాయకులూ-ఎందరెందరో ఉన్నారు. అందరికీ బంధనములు. ఎన్నాటికో! ఎన్నటికో! కుష్ఠువ్యాధిని గూర్చి క్షయను గూర్చి, ఆఖరుకు మలేరియాను గూర్చి ఆరోగ్య మంత్రిత్వశాఖా, వైద్యవిజ్ఞానం ఆందోళన చెందుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాని ఈ భయంకరమైన రోగం కుదిరే దెన్నటికో!

ఇంతకన్నా వేరే సమాధానం చెప్పుకోలేను ధనరాజునుగూర్చి.

శేషూ, వాళ్ళాయనా సుఖంగా వుండాలని కోరుకుంటూ రూము తాళంతీసి లోపలకు అడుగుపెట్టాను.